క్లుప్తంగా

ఎన్‌ఎంఎంఎస్‌కు ఎనిమిది మంది ఎంపిక

రావికమతం: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్(ఎన్ఎంఎంఎస్)కు మరుపాక మోడల్ స్కూల్ నుంచి ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికయ్యారు. కేంద్ర ప్రభుత్వ మానవ వనరుల శాఖ ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ఏటా నవంబరులో ఈ పరీక్ష నిర్వహిస్తుంది. మరుపాక స్కూల్ నుంచి 30 మంది విద్యార్థులు హాజరుకాగా కె.వర్షిణి, సీహెచ్ తులసి, టి.అంజలి, బి.సతీష్, టి.కుమార్‌రాజా, కె.వెంకటహర్ష, జి.మురళి సాయి లాసన్ సుహాన్ తో సహా ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ సత్యసునీల్ శుక్రవారం తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులపై అర్ల గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

రోలుగుంట: మండలంలోని అర్ల గిరిజన పంచాయతీలో జరిగిన ఉపాధి పనులను మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంటు టీం శుక్రవారం పరిశీలించింది. ఈ పంచాయతీలో జరిగిన ఉపాధి పనులు, కూలి గిట్టుబాటు తదితర విషయాలను టీమ్ సభ్యులు అజయ్ పైల, సంజుని గుప్తా కూలీలను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు రోలుగుంటలో గల ఉపాధి కార్యాలయాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ శ్రీనివాసకుమార్, ఏపీవో సూర్యామణి తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



మాట్లాడుతున్న సీఐ అప్పలనాయుడు

రావికమతం: అంకితభావంతో పనిచేసిన ఏ ఉద్యోగికైనా ప్రజల ప్రజల్లో మంచి గుర్తింపు ఉంటుందని, బదిలీపై వెళుతున్న సీఐ మహమ్మద్ అందరి మన్ననలు, గుర్తింపు పొందారని కొత్తకోట సీఐ ఎల్.అప్పలనాయుడు తెలిపారు. సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్‌ను శుక్రవారం రాత్రి పోలీసులు,ప్రజా ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రస్తుత సి.అప్పలనాయుడతో పాటు పలువురు మాట్లాడారు.

మార్కెట్ కమిటీ ఉద్యోగికి సన్మానం



ఉద్యోగిని సత్కరిస్తున్న మార్కెట్ చైర్మన్ వెంకట సత్యారావు

చోడవరం రూరల్: స్థానిక మార్కెట్ కమిటీ అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేసి, ఉద్యోగ ఉన్నతిపై గ్రేడ్ 3 సెక్రటరీగా కొత్తవలస మార్కెట్‌కు బదిలీ అయిన కె.విజయ్‌బాబును శుక్రవారం స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో చోడవరం మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక వెంకట సత్యారావు, అసిస్టెంట్ సెక్రటరీ బంగారురాజు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన భవనాల నిర్మాణం



సూచనలిస్తున్న మండల ప్రత్యేకాధికారి లక్ష్మి

నాతవరం: నూతన భవన నిర్మాణాలు ఈనెలా ఖరువులోపు పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి జి.వి.లక్ష్మి తెలిపారు. మండలంలో బెన్నవరంలో భవన నిర్మాణాలు, శృంగవరంలో జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. అనంతరం మండల స్థాయి అధికారులతో ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ పనులను యుద్ధప్రతిపాదికన పూర్తి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో రాంబాబు, జేఈలు జోగారావు, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

'దశ' తిరిగిన గ్రామాలు



గొండుపాలెంలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం

పల్లెలు ప్రగతికి చిరునామాలుగా మారాయి. ఒకప్పుడు దైన్యంగా.. సమస్యలకు కేరాఫ్‌గా ఉండే ఊళ్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చూపిన ప్రత్యేక శ్రద్ధతో ప్రగతికి చిహ్నంగా మారాయి. పంచాయతీల అభివృద్ధికి ప్రతిబంధకంగా ఉన్న సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించారు. దీంతో రహదారులు అద్దంలా మారాయి. గ్రామాల్లోనే హెల్త్‌క్లినిక్‌లు, సచివాలయాలు, ఆర్బీకేలు, ఇంటింటికీ కుళాయిలు అందుబాటులోకి వచ్చాయి.



కె.సంతపాలెంలో ప్రారంభోత్సవానికి సిద్ధమైన ఆర్బీకే భవనం

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో శరవేగంగా గ్రామాల అభివృద్ధి
- జల్‌జీవన్ మిషన్ నిధులతో మంచినీటి పథకాలు
- ఇంటింటికీ కుళాయిలు
- నేడు 10 గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభం
- హాజరుకానున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

కె.కోటపాడు : సీఎం వైఎస్ జగన్‌పాలనలో గ్రామాల అభివృద్ధి శరవేగంగా జరిగింది. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక దృష్టితో నాలుగున్నరేళ్ల కాలంలో ఊళ్లు అభివృద్ధికి చిరునామాలుగా మారాయి. మాడుగుల నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి వెలుగులు విరబూస్తున్నాయి.

నేడు ప్రారంభోత్సవం

మండలంలో 10 గ్రామాల్లో రూ.17.18 కోట్ల వ్యయంతో నిర్మాణం పూర్తయిన అభివృద్ధి పనులను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రారంభించనున్నారు. ప్రధానంగా లంకవానిపాలెంలో రూ.1.60 కోట్లతో నిర్మించిన నూతన పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభించనున్నారు. ఇక్కడ 1968లో పీహెచ్‌సీ భవనాన్ని నిర్మించారు. సుమారు 57 ఏళ్లు కావస్తున్నా పాత భవనంలోనే ఆస్పత్రిని నిర్వహిస్తున్నారు. నాడు-నేడు కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు నిధులు మంజూరు చేయడంతో ఆస్పత్రికి నూతన భవనం సమకూరింది.

- గుల్లేపల్లిలో రూ.1.64లక్షలతో నిర్మించిన సచివాలయం, సీసీ రోడ్డు, 30 వేల లీటర్ల సామర్థ్యం గల మంచినీటి పథకం, ఇంటింటి కుళాయిలను డిప్యూటీ సీఎం బూడి ప్రారంభించనున్నారు.
- రూ.4.78 కోట్లతో నిర్మించిన గొండుపాలెం-మురుగుపాలెం తారురోడ్డు, సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ భవనాలతో పాటు సీసీ రోడ్లకు ప్రారంభోత్సవం చేయనున్నారు.
- కింతాడలో రూ.1.65 కోట్లతో నిర్మించిన సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ భవనాలు, సీసీ రోడ్లు, గొల్లలపాలెంలో మంచినీటి పథకం, ఇంటింటి కుళాయిలు, కె.కె.అగ్రహారంలో రూ.7లక్షలతో నిర్మించిన సామాజిక భవనం, కె.సంతపాలెంలో రూ.1.88 కోట్లతో నిర్మించిన సచివాలయం, వెల్‌నెస్, ఆర్బీకే భవనాలు, సీసీ రోడ్లు, మంచినీటి పథకం, ఇంటింటి కుళాయిలను ప్రారంభించనున్నారు.
- సూర్రెడ్డిపాలెంలో రూ.60 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, అంగన్‌వాడీ కేంద్రం, వారాడలో రూ.1.69 కోట్లతో నిర్మించిన సచివాలయం, వెల్‌నెస్, ఆర్బీకే భవనాలతో పాటు జల్‌జీవన్ మిషన్ నిధులతో ఏర్పాటు చేసిని ఇంటింటి కుళాయిలు, ఆర్.వై.అగ్రహారంలో రూ.87లక్షలతో నిర్మించిన సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ భవనాలు, కింతాడ-లంకవానిపాలెం గ్రామాల మధ్య పూర్తయిన 9 కిలోమీటర్ల తారురోడ్డును డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రారంభించనున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమాలను పండగలా జరుపుకొనేందుకు ఏర్పాట్లును చేస్తున్నారు.



లంకవానిపాలెంలో ప్రారంభోత్సవానికి సిద్ధమైన పీహెచ్‌సీ భవనం



కింతాడలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం



గొండుపాలెం-మురుగుపాలెం మధ్య నిర్మించిన తారురోడ్డు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



గొండుపాలెం గ్రామంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడి ప్రత్యేక శ్రద్ధతో ఎనలేని అభివృద్ధి జరిగింది. గతంలో గొండుపాలెం నుంచి మురుగుపాలెంకు కాలినడకన వెళ్లాల్సిన పరిస్థితి. వర్షాకాలంలో మా బాధలు వర్ణనాతీతం. ఈ రెండు కిలోమీటర్ల మట్టిరోడ్డును తారురోడ్డుగా మార్చడంతో పాటు రెండు చోట్ల కల్వర్టుల నిర్మాణం జరిపేందుకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు రూ.2 కోట్లు మంజూరు చేశారు. తారురోడ్డు నిర్మాణం పూర్తవడంతో ప్రయాణ కష్టాలు తీరాయి. గ్రామస్తులమంతా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి కృతజ్ఞతగా ఉంటాం.

–బండారు శ్రీను, గొండుపాలెం

ఇంటి వద్దకే సురక్షిత మంచినీరు



కె.సంతపాలెంలో మంచినీటి సమస్య ప్రజలను వేధించేది. ఈ సమస్యను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే గ్రామంలో రూ.40వేల లీటర్ల సామర్థ్యం గల మంచినీటి పథకం, ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు రూ.51లక్షల మంజూరు చేశారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైయినేజీలకు రూ.50లక్షలు మంజూరు చేశారు. తాగునీటి సమస్యకు పరిష్కారం లభించడంతో పాటు మౌలిక వసతులు సమకూరడంతో గ్రామంలో ప్రజలు ఆనందంగా ఉన్నారు.

–చల్లా మంగ, సర్పంచ్, కె.సంతపాలెం

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



తురకలపూడిలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట : రైతు సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ ప్రభుత్వం పనిచేస్తోందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. తురకలపూడి గ్రామంలో రూ. 21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆయన స్థానిక నాయకులు, అధికారులతో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సొంత గ్రామాల్లోనే రైతులకు విత్తనాలు,ఎరువులు అందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయడమే కాక వ్యవసాయ పెట్టుబడుల కోసం రైతు భరోసా నగదు అందిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, కోఆపరేటివ్ అధ్యక్షుడు నాగభూషణం, సర్పంచ్ గోవింద, మాజీ సర్పంచ్ గంట్ల అప్పలనాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కోరుకొండ అప్పలనాయుడు, డైరెక్టర్లు గొల్లవిల్లి సత్యనారాయణ, వెలుగుల శ్రీను, రైతు సంఘ నాయకులు కాసు, డీఈ

గృహ అవసరాలకు పూర్తిస్థాయిలో త్రీఫేస్ విద్యుత్



విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్షిస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

చోడవరం: గృహ వినియోగదారులకు పూర్తిస్థాయిలో త్రీఫేస్ విద్యుత్ అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నట్టు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. చోడవరంలో తన కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో కొన్ని గ్రామాల్లో వ్యవసాయ, గృహ అవసరాలకు సంబంధించిన విద్యుత్ లైన్లు ఒకే లైన్‌మీద ఉన్నాయని, వాటిని విభజించేందుకు ప్రత్యేక విద్యుత్ లైన్లు వేస్తున్నామన్నారు. ఈ పనులను రూ. 21కోట్లతో చేపట్టినట్టు చెప్పారు. వెంకన్నపాలెం,రోలుగుంట,కొత్తకోట, రావవికమతం, తోటకూరపాలెం, గొంప, విజయరామరాజుపేట, మంగళాపురం బంగారుమెట్ట, బుచ్చెయ్యపేట, మల్లాం, పెదమదీన ప్రాంతాల్లో ప్రత్యేక ఫీడర్లు వేసి గృహ వినియోగదారులకు త్రీఫేస్ సప్లై ఇచ్చే పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. వ్యవసాయానికి 9గంటల పాటు నిరాటంకంగా విద్యుత్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో సుమారు రూ. 50 కోట్లతో పనులు చేసి, విద్యుత్ సరఫరా ఇవ్వడం జరిగిందన్నారు. జగనన్న కాలనీలకు కూడా పూర్తిస్థాయిలో విద్యుత్ సౌకర్యం కల్పించామని చెప్పారు. నియోజవర్గంలో ఎక్కడా విద్యుత్ సమస్య లేకుండా అన్ని సమస్యలు పరిష్కరించామని ధర్మశ్రీ తెలిపారు. ఈ సమావేశంలో ఏపీఈపీడీసీఎల్ నర్సీపట్నం డీఈ రామకృష్ణ, ఏడీఈఈ గౌరీపతి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

మాకవరపాలెం: అన్‌రాక్(పయినీర్) రిఫైనరీలో ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం తహసీల్దార్ మురళీమోహనరావు రిఫైనరీ సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ నాయకుల ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు వేయాలని సూచించారు. డీటీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న జెడ్పీటీసీ అప్పలనర్స, సర్పంచ్ రాణి

నాతవరం: స్థానిక హైస్కూల్‌ను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయడంపై పలువురు నాయకులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. మేరకు హైస్కూల్‌లో శుక్రవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్ర పటానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు క్షీరాభిషేకం చేశారు. జెడ్పీటీసీ సభ్యులు కాపారపు అప్పలనర్స, వైస్ ఎంపీపీ పైల సునీల్, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ రాజాక్, వైఎస్సార్‌సీపీ నాయుకుడు కరక అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, సర్పంచ్ గొలగాన రాణి పాల్గొన్నారు.

ఘనంగా పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం

నర్సీపట్నం: పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక వెంకునాయుడుపేట పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పీఆర్‌టీయూ పతాకాన్ని జిల్లా అధ్యక్షుడు, ఉత్తరాంధ్ర కన్వీనర్ డి.గోపినాథ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీవద్దు

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



ఎంపీడీవో కార్యాలయ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: మండలం కేంద్రం దేవరాపల్లిలో రూ. కోట్ల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీ పడవద్దని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. సుమారు రూ.3 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఎంపీడీవో కార్యాలయ భవనాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. రెండు అంతస్తుల్లో నిర్మిస్తున్న భవనంలో ప్రతి గదిని పరిశీలించి స్థానిక ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ఎరుకుల పేట మీదుగా కొత్త సచివాలయం వరకు రూ. 21.6 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన పర్యవేక్షించారు. అభివృద్ధి పనుల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మార్క్ కనిపించేలా పక్కాగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఇంజినీరింగ్ అధికార్లకు సూచించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, పంచాయితీరాజ్ ఏఈ కె.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం

మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి



మండల సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి

దేవరాపల్లి: ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించబోమని స్థానిక ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి అన్నారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ రాజేశ్వరి అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమస్యల పరిష్కారంలో అధికార్లు అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆరోపిస్తూ పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సమగ్ర భూ రీసర్వే సక్రమంగా జరగలేదని, సరిహద్దు రాళ్లు సరిగా వేయలేదని బోయిలకింతాడ సర్పంచ్ బూరె బాబురావు, రైవాడ సర్పంచ్ చల్లా లక్ష్మి, ఎ. కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం బ్రోకర్లకు అడ్డాగా మారిందని, ఇక్కడి రికార్డులు సైతం కొందరు రియల్‌ఎస్టేట్ బ్రోకర్ల చేతుల్లో ఉన్నాయని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వేచలం పీహెచ్‌సీ వైద్యాధికారి బి.హారిక మాట్లాడుతూ తమ పీహెచ్‌సీకి ఇటీవల కొందరు వ్యక్తులు మద్యం సేవించి వచ్చి రాత్రి పూట విధుల్లో ఉన్నా మహిళా సిబ్బంది పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని, దీనిపై పోలీసులకు పిర్యాదు చేశామన్నారు. అంతకు ముందు మండల స్థాయి అధికారులు శాఖల వారీగా అందిస్తున్న సేవలను, పథకాల వివరాలను సభకు వివరించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సీహెచ్. సుబ్బలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ ఎస్.సురేష్, వైస్ ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, సర్పంచ్‌లు రొంగలి వెంకటరావు, దాడి జగన్, నాగిరెడ్డి శరారినాయుడు, కర్రి సూరినాయుడు, ఎంపీటీసీలు పంచాడ సింహాచలంనాయుడు, రొంగలి నారాయణమ్మ తదితర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో గ్రామాల్లోనే మెరుగైన వైద్య సేవలు



వైద్య సేవలను పర్యవేక్షిస్తున్న మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి



తురువోలులో పరిశీలిస్తున్న ఎంపీపీ జయమ్మ, జెడ్పీటీసీ శారదా జానకీరాం

కె.కోటపాడు : గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందించేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్టు మండల ప్రత్యేకాధికారిణి నాగలక్ష్మి తెలిపారు. మండలంలో ఆర్.వై.అగ్రహారంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 288 మందికి లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ, ఆర్థోపెడిక్ నందకిషోర్, కంటి వైద్యుడు రాజీవ్ వైద్య పరీక్షలను జరిపి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరాన్ని పరిశీలించిన నాగలక్ష్మి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో చికిత్స పొందేవారి ఆరోగ్యం మెరుగుపడేంత వరకూ ఏఎన్ఎం, ఆశా కార్యకర్తల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి కిషోర్‌కుమార్,హెల్త్ సూపర్‌వైజర్ సన్యాసిరావు, హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్, కన్నూరు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.


రోలుగుంట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా కొమరవోలులో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కొమరవోలు, పదాలపాలెం తదితర గ్రామాల నుంచి వచ్చిన సుమారు 318 మందికి వైద్యులు ధనలక్ష్మి, జి.సువర్ణ, జి.అనీష పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో వీరజ్యోతి పర్యవేక్షించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చీడికాడ: జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కురచా జయమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని తురువోలులో రెండవ విడత జగన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు.

ఈ కార్యక్రమాన్ని జెడ్పీటీసీ లాలం శారదా జానకీరాంతో కలిసి ఎంపీపీ ప్రారంభించారు. శిబిరంలో 367 మందికి వైద్య పరీక్షలు చేశారు. సర్పంచ్ మట్టా అప్పారావు, ఉపసర్పంచ్ పి.టి.బాబు, వైఎస్సార్‌సీపీ నేతలు లాలం శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం కుల గణన సర్వే



కుల గణన సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: నిబంధనల ప్రకారం కుల గణన సర్వే నిర్వహించాలని ఎంపీడీవో జె.రాంబాబు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం వలంటీర్లు చేస్తున్న ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కులగణన సర్వేను తప్పులు లేకుండా చేయాలన్నారు. కార్యదర్శి శ్రీను పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో రక్తహీనతకు చెక్

కె.కోటపాడు : విద్యార్థులు రక్తహీనత సమస్య బారిన పడకుండా ఉండేందుకు ఏడాదికి రెండు మార్లు నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను వేసే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి, చౌడువాడ పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు తెలిపారు. శుక్రవారం గొండుపాలెం, రొంగలినాయుడుపాలెం, గుల్లేపల్లి, కె.కోటపాడు గ్రామాల్లోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేసే కార్యక్రమాన్ని వీరు పరిశీలించి,మాట్లాడారు.ఎంఎల్‌హెచ్‌పీ శశికళ, హెచ్ఎం అపూర్వ పాల్గొన్నారు.

మాడుగుల/మాడుగుల రూరల్: జేడీపేట పాఠశాలలో ఇన్‌చార్జి ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. కింతలి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.ఎం.నాయుడు, సర్పంచ్ కృష్ణమూర్తి, పీహెచ్ఎన్ పుష్పమ్మ పాల్గొన్నారు. కేజేపురం పీహెచ్‌సీ పరిధిలో 6,900 విద్యార్థులకు, వడ్డాది పీహెచ్‌సీ పరిధిలో 750 మందికి మాత్రలు పంపిణీ చేసినట్టు వైద్యాధికారులు ఎల్.వి.ఎస్.ఎస్. ప్రసాదుపాత్రుడు, శకుంతల తెలిపారు.

గొలుగొండ: మండలంలో గొలుగొండ, కృష్ణదేవిపేట పీహెచ్‌సీల పరిధిలో నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. వైద్యాధికారులు శ్యాంమ్, ప్రతాప్‌కుమార్, నర్సీపట్నం మార్కెట్‌యార్డు చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, జిల్లా ఎస్సీసెల్‌అధ్యక్షురాలు లోచుల సుజాత పాల్గొన్నారు.

రోలుగుంట: కొమరవోలులో నిర్వహించిన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో వీరజ్యోతి ప్రారంభించారు. వైద్యులు ధనలక్ష్మి, శ్రావణి,సర్పంచ్ గొర్లె రమణమ్మ, ఎంపీటీసీ వెంకట రామన్, ఎంపీహెచ్ఈవో కృష్ణ, సూపర్‌వైజర్ షాజహాన్ తదతరులు పాల్గొన్నారు.

చీడికాడ: తురువోలు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎంపీపీ కురచా జయమ్మ నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం,సర్పంచ్ అప్పారావు,ఉపసర్పంచ్ పి.టి.బాబు పాల్గొన్నారు.

నాతవరం: మండల వ్యాప్తంగా 8990 మందికి మాత్రలు పంపిణీ చేయనున్నట్టు నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.రాజేష్ నాయుడు, ప్రసన్న తెలిపారు.

బుచ్చెయ్యపేట: తురకపూడి హైస్కూల్ విద్యార్థులకు నులిపురుగులు నివారణ మాత్రలను పీహెచ్‌సీ వైద్యాధికారి సంధ్యారాణి అందజేశారు.ఎంపీహెచ్‌వో కె.వి.రాజశేఖర్, ఫార్మాసిస్టు సయ్యపురెడ్డి చంద్రమౌళి పాల్గొన్నారు.

మాకవరపాలెం: బూరుగుపాలెం, మాకవరపాలెం పీహెచ్‌సీల పరిధిలో 8,484 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేసినట్టు వైద్యాధికారులు సీతారామలక్ష్మి, చరిష్మ తెలిపారు.

చోడవరం రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. ఎన్ఎస్ఎస్ మూడు యూనిట్ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.రాధాకృష్ణ, ఎన్ఎస్ఎస్ పీవోలు రత్నభారతి, డి.మాల్యాద్రి, బి.పిచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

గడ్డి కత్తిరించే యంత్రాల పంపిణీ



రైతులకు గడ్డి కటింగ్ యంత్రాలు అందిస్తున్న దృశ్యం

చీడికాడ: పాడి రైతులకు 40 శాతం రాయితీపై మంజూరు చేసిన ఏడు గడ్డి కత్తిరించే యంత్రాలను శుక్రవారం జెడ్పీటీసీ లాలం శారదాజానికీరాం పంపిణీ చేశారు. మండలంలోని తునివలస శివారు వింటిపాలెం గ్రామంలో నిర్వహించిన పశువిజ్ఞాన బడి కార్యక్రమంలో వీటిని పంపిణీ చేశారు. మాడుగుల పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు చిట్టినాయుడు , చీడికాడ పశువైద్యులు గాయత్రి దేవి, మాజీ సర్పంచ్ పడాల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.